# లుడ్విగ్‌వాన్ బీతోవెన్

అతడేమంత పొడగరి కాడు, సొగసరి అంతకన్నా కాడు, ధనికుడు కాడు, పెద్దపదవి నలంకరించినవాడూకాడు. కాని ఒకసారి ప్రష్యన్ రాజు గుర్తించిన ప్రసక్తి అతడి ఎదుట వస్తే—అతగాడెటువంటి సంకోచమూ లేకుండా నిబ్బరంగా "నేనూ రాజునే !" అన్నాడు.

ఎవడతడు ?

దేవుళ్ళనూ, దయ్యాలనూ, బానిసలనూ, యోధులను, చీకటి శక్తులతో లోకుల పోరాటాలను, ఆనందోద్రేకాన్ని, బాధాతిమిరాన్ని, కోట్లాది గుండెల చప్పుళ్ళని పిలిచి, తన ఊహతో ప్రాణంపోసి, శబ్దంతో మలిచి, సంగీతంతో అందాలు దిద్ది ప్రపంచానికి వెలలేని కానుకలుగా ఇచ్చిన సంగీత సార్వభౌముడు !

ఒకసారి అతడి సంగీత రూపకం చూచి, విని తన్మయత్వంతో ద్రవించిన వందలాది ప్రేక్షకులను చూచి ఆ కళాకారుడు ఆనందంతో, కృతజ్ఞతతో తలవంచగా చూచిన ఒక శ్రోత "కళారహస్యాన్వేషణలో పండిన ఆ తలను చూస్తే, ఆ సుసంపన్నమైన సంగీత వైవిధ్యాన్ని వింటే—మంచు కప్పిన అగ్నిపర్వతం గుర్తుకొస్తుంది" అన్నాడట !

ఆ మంచు కప్పిన అగ్ని పర్వతం పేరు, పాశ్చాత్య సంగీత శిఖరాలలో ఆ ఎవరెస్టు పేరు లుడ్విగ్ వాన్ బీతోవెన్ !

మోజార్ట్, హెయిడన్‌వంటి హేమాహేమీలున్న ఆనాడు – "ఒక రాజ్యంలో తాను రాజునని రాజుకే తెలుసు'' అన్న బీతోవెన్ రాజసం చూస్తే మన శ్రీనాథుడు గుర్తుకు వస్తాడు.

కాని పేదరికంలో పుట్టి పేదరికంలోనే పెరిగి కేవలం తన సంగీత శక్తి ద్వారా దేశదేశాల నేలిన ఆ ఏలిక ఏనాడూ ఎవరికీ తలవంచలేదు. తనకు సాయంచేసిన వారినికూడా, వారి మాటకాని, చేతకాని ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వుందన్పిస్తే విదిలించి పారేసేవాడు.

"మన రాజులకన్న అల్పులుండబోరు. ఉన్న ధనంపోతే వారు గడ్డిబొమ్మలవుతారు. డబ్బుతో అధికారంతో ఒకణ్ణి రాజుగారి సభలో సభ్యుడిగా చేయవచ్చుగాని వారొక గెటెనిగాని, ఒక బీతోవెన్‌నుగాని చేయ గలరా?'' అని ప్రశ్నించిన బీతోవెనే - ''ఆ కలవారి సమాజంతో కలుస్తూ వుండాలి కాని వారి నెత్తిని మొట్టికాయలు వేస్తూ వుండాలి !'' అన్నాడు.

అతడిని ఆర్థికంగా ఆదుకుని సాయపడిన లాబ్‌కౌంట్జ్ యువరాజు ఇంట ఒకసారి బీతోవెన్ ఒక సంగీత కార్యక్రమం ఒద్దిక (రిహార్సల్స్) ఏర్పాటుచేశాడు. ఆనాడు ముగ్గురిలో ఒక బాసూన్ (నాదస్వరంలాంటిది) వాద్యకారుడు రాలేదు "ఒక బాసూన్ లేనంతమాత్రాన పెద్ద తేడా ఏమీ రాదుగా " అన్నాడు యువరాజు. అంతే బీతోవెన్ ఒద్దికనక్కడితో ఆపేసి, చరచర లేచి వెళ్లుతూ గుమ్మందగ్గర వెనుక్కు తిరిగి-''లాబ్‌కొవిట్జ్ సంగీతం తెలియని గాడిద!" అని చెప్పి మరీ ఇంటికి వెళ్లిపోయాడు....

మరొకసారి సంగీత ప్రియుడు, బీతోవెన్ అభిమాని అయిన లూయీ ఫెర్డినాండ్ యువరాజు తన ఇంట బీతోవెన్ సంగీత కచ్చేరి, విందు ఏర్పాటుచేశాడు. అక్కడికి రాగానే విందుకోసం యువరాజుగారికి వారి ఇద్దరు మిత్రులకు ఒక మేజా, తనకు విడిగా దూరంగా ఒక మేజా ఏర్పాటు చేయడం చూచి ఆగ్రహంతో చెడామడా తిట్టి వెళ్ళిపోయిన బీతోవెన్‌ను ఉప

శమింపచేయడానికి ఆ రాజుగారు ఇంకో విందు నేర్పాటుచేసి తనకు రాణి గారికీ మధ్య అతడిని కూర్చోబెట్టుకోవాల్సి వచ్చింది.

అందుకనే అతడి మిత్రుడయిన షుప్పనిహ్—"బీతోవెన్ ఈభూమ్మీద వున్న అకాడెమీలన్నింటికీ రారాజూ, నియంతాకూడాను!'' అని వర్ణించాడు.

ఇంతటి దూర్వాసుడూ, సంగీతంలోకి వెళ్ళిపోతే కుసుమసదృశం అయిపోయేవాడు, లాలిత్యం జాలువారే అతడి సంగీత రచనలకు ఈనాటికీ రసజ్ఞలోకం కనుల నీరు కారుస్తుంది. ధనాన్ని, అధికారాన్ని, మదాన్ని పొట్టేలులా ఢీకొన్న ఈ మేరువే ప్రకృతితో, పిల్లలతో, శిష్యులతో, తాను ప్రేమించిన వారితో మెలిగేటప్పుడు అతికోమలంగా వుండేవాడు!

ఏమిటి ఈ వైరుధ్యం? ఎందుకీ సంఘర్షణ! అని తెలుసుకోవాలి అంటే బీతోవెన్ బాల్యంలోకి వెళ్లాలి. తండ్రి రొట్టెలమ్మేవాడు, కానీ తాగుబోతు, తల్లి పుడమితల్లివలె ఓపికగా సంసారాన్ని నడిపేది. ఎడాపెడా అప్పులుచేసి తండ్రి పారిపోగా ఒక పక్క ఆకలితో, మరోపక్క అప్పుల వాళ్ళ తిట్లు అవమానాలతో కుంచించుకు పోయేవాడు బీతోవెన్. ఆ తల్లి కూడా కన్ను మూయడంతో ప్రపంచమంతా తన శత్రువులా కన్పించగా దానినెదుర్కోవడానికి వరప్రసాదమయిన తన అపూర్వసంగీతమే ఆయుధంగా వాడుకున్నాడు బీతోవెన్. ఈ పీడకలలాంటి బాల్యమే అతడినంత పెడసరంగా తయారుచేసిందనుకోవచ్చు....

అతడి తాతగారయిన లుడ్విగ్ వాన్ బీతోవెన్ (మనుమడి పేరూ అదే) చక్కటి ఫిడేలు విద్వాంసుడు, చక్కటి గాత్ర సంపద కలవాడు. రాజాస్థానంలో సంగీత కళాకారుడు ఆయననుండే మనుమడి రక్తంలోకి ప్రవహించిన సంగీతం కట్టలు తెంచుకొని పరుగులెత్తింది, పరవశంతో నాట్యం చేస్తూ రసికులను ప్రమోదంలో ముంచెత్తింది.

తన పన్నెండవ యేట కొలోన్ యువరాజు కొలువులో ఆరాన్గ వాద్య కళాకారుడుగా చే-డు బీతోవెన్ క్రిస్టీన్ గాటిలెబ్ నెఫ్, హేయ్‌డన్, ఆల్ బ్రెఖ్ట్స్‌బెర్గర్, సరింకురిల వద్ద ఆ రత్నం సానపెట్టబడింది.

బీతోవెన్‌కు పదహారేళ్ళ వయసప్పుడు సంగీత ప్రపంచంలో ధృవ తారగా వెల్గుతున్న 31 సం॥ల మొజార్ట్ ఒక ఇతి వృత్తాన్ని ఇవ్వగా, అప్పటికప్పుడు బీతోవెన్ దాని నాధారంగా ముప్పావుగంట పియానోమీద అద్భుతంగా రూపకల్పన చేసి వాయించాడు, "ఇతడొకనాడు ఈ లోక మంతటినీ ఏలే సంగీతకారుడవుతాడు-" అని జోస్యం చెప్పాడు మొజార్ట్. ఆ జోస్యం నిజం అయింది!

1770 లో పుట్టి 1827 లో కన్నుమూసిన లుడ్విగ్ వాన్ బీతోవెన్ సుమారు 200 దాక సింఫనీలు సొనాటాలు, ట్రయోలు, క్వార్టెట్లు, బాలేలు, ఏరియాలు, పాటలు కాక "ఫిడెలియో" అన్న ఒకే ఒక ఆపెరానూ (సంగీత రూపకం) రచించాడు, పియానో, వయొలిన్ల మీద వాయించాడు, వాద్యబృందాలకు నాయకుడిగా ఆ రచనలకు జీవంపోసి వాటిని చిరంజీవులుగా నిలబెట్టాడు. ధనికుల వద్ద, తన రచనలనచ్చు వేసిన విక్రేతలవద్ద ముక్కుపిండి డబ్బు వసూలు చేసిన యీ మహానుభావుడు తన శిష్యుల నుండి ఒక గవ్వయినా పుచ్చుకోలేదు. తాను—ఆర్జించిన దానిని దాన ధర్మాలకు వినియోగించే వాడు.

తన పైలాపచ్చీసు ముగియగానే అతడిలా రాసుకున్నాడు" పాతికేళ్ళు గడిచిపోయాయి. ఈ సంవత్సరం యీ మనిషిని తేల్చివేయాలి. శరీరం బలహీనమయినా సంకల్పం ధృఢంగా వుండాలి. ఏదో ఒక ఒడ్డుకు తీరాలి—" అనడంలోని ఆత్మవిశ్వాసం అతడి రచన లన్నిటలోను ద్యోతకం అవుతుంది.

ఇంతటి సంగీత సామ్రాట్టుకు 31వ ఏట చెవుడురావడం అన్నది కళాకారులతో విధి ఆడే ఆట కాకపోతే యింకేమిటి? ప్రేమలో వైఫల్యం,

నా అన్నవారు లేరన్నబాధ ఐశ్వర్యాధికారాలతో నిరంతరం పోరాటం ఆస్తామ్త కాక చెవుడు—వీటన్నిటిని అధిగమించి కమనీయ సంగీత కళా స్రవంతులను సృష్టించిన ఆ మహోన్నత వ్యక్తిత్వానికి - ఈనాటి మరు గుజ్జులం మనం ఏమని నివాళులర్పించగలం? పదాల పరిధికిలోబడని వ్యక్తిత్వం అది...

చెవుడు వచ్చిన తర్వాత బీతోవెన్ అనేక అద్భుతమైన రచనలు చేశాడు. కాని ఏనాడూ అతడు ఎవరినీ తన సంగీత రచన ఎలావుందని అడగనూలేదు, అలాగని ఒక్క అపశ్రుతిని కూడా పల్కించనూ లేదు! 'జీనియస్' అంటే ఇదే కాబోలు! తన కళలో సంపూర్ణంగా లీనమయి అంతర్ముఖుడయిన యోగికి బాహ్యేంద్రియాలతో పనిలేదు కాబోలు... మొదట తన చెవిటితనం గురించి సిగ్గుపడిన బీతోవెన్ కొంతకాలానికి ఆ బల హీనత నుండి బయటికి వచ్చాడు. తన సంగీతంలో సెలయేరుకాగా అందరినీ తనలో కలుపుకుని జీవనంలో ముందుకు సాగాడు.

ఒకానొక పబ్లిషరుకు వుత్తరం రాస్తూ బీతోవెన్—"కళాకారుడికి గాని, రచయితకు గాని అతడి రచనకు తగినంత పారితోషికం ఇవ్వడం కాదు, అతడు ఏ చీకూచింతా లేకుండా తనలోని కళను వెలయించడానికి, సమాజం అతడి నుండి ఏది ఎదురు చూస్తున్నదో దానిని అతడు సమర్పించ డానికి దోహదం చేసేలాగున అతడిని పోషించాలి, ఆదుకోవాలి-" అన్న మాటలు ఈనాటి రచయితలకు స్వప్నంలా ధ్వనించడం ఈ జాతి దౌర్భా గ్యం కాకపోతే ఏమిటి? మనిషి అంటే, పశువు కాకపోతే, ఉత్తి శరీరం కాకపోతే, మనిషంటే మెదడు, మనసు, హృదయం అయితే—కథగా, కవితగా, పాటగా, పద్యంగా, చిత్రంగా శిల్పంగా, నాట్యంగా మనిషిలోని చైతన్యాన్ని వెలిబుచ్చుతూ, ఇంకో వెయ్యేళ్ళ తర్వాతనో వందేళ్ళ తర్వా తనో రాబోయే నిండు మనిషికి విత్తనాలు వేస్తున్న నేటి సృజనాత్మక కళాకారులు 'దేహీ' అని చిప్ప పట్టుకు తిరిగేలా చేసే సమాజం—తన్ను

తాను చంపుకుంటూంది : భ్రూణహత్య చేస్తూంది; నేటి కళాకారుడిని ఆదుకోని సమాజానికి 'రేపు' అనేది వుండబోదు.

ఈ పరమ సత్యానికి ఒక ఉదాహరణ.

— "బీతోవెన్ తన రచనలను అంకితం చేసిన ఆ ప్రభువులూ, సంపన్నులూ - బీతోవెన్ ఆ పని చేయకపోతే ఈనాడు మనకు వారి పేర్లు కూడా మిగిలేవి కావు —" అన్నాడు బీతోవెన్ జీవిత చరిత్ర రచించిన ఎమిల్ లుడ్విగ్. ఆ కళాపుష్పాలు నిలబడ్డాయి, దాంతోబాటే ఆ రాజు పేరనే దారం నిలబడింది. "కారే రాజుల్!" అన్నట్లుగా, కాలం తెర వెనుకకు రాజులు జారిపోతారుగాని పోతన్నలు, త్యాగయ్యలు, కబీరు దాసులు, వీరేశలింగాలు, గురజాడలు, ఉన్నవలు, ఉదయశంకర్లు పోరు; వారు అడవి మనిషి నుండి రేపటి యుటోపియా మనిషిదాకా వున్న మానవ మహాప్రస్థానంలో మైలురాళ్ళవంటి మణిదీపాలు

అందుకనే ఒక రాజుతో-"నువ్వు నీ తండ్రికి కొడుకువు గనుక అదృష్టవశాత్తు రాజువయ్యావు. కాని నేను నేనుగా బీతోవెన్ అయ్యాను. రాజులకేమిటి వందల కొలది వున్నారు. బీతోవెన్ మాత్రం ఒక్కడే!" నని చెప్పగల్గిన ఘనత ఆయనకే దక్కింది.

సంగీతం ద్వారా స్థలాన్ని, కాలాన్ని నిర్జించగల్గినవాడు గనుకనే అతడి ప్రయోగాలు అనేకం సమకాలీనలకు అర్థమయ్యేని కావు నేటినే సరిగా చూడలేని హ్రస్వ దృష్టి విమర్శకులు బీతోవెన్‌కు ఎదురయ్యారు. ఒకానొక సంగీత రచనలో సరికొత్త ప్రయోగాన్ని ఒకరు విమర్శించగా-"అవి మీ కోసం కావు, రాబోయే తరాల వారి కోసం!" అని బీతోవెన్‌కు చెప్పిన సమాధానం అతియోశక్తి కాదని కాలం చెప్పింది. పియానో, వయొలిన్ల ప్రయోగాలలో కూడా పెద్ద అంగలు వేసిన సంగీతాంగదుడు బీతోవెన్.

ఒక వుత్తరంలో "నాతో ఎవ్వరూ లేక పోయినా నేనొంటరిని కాను...నాతోబాటు నా మిత్రులు చెటు చేమలు, వాగులు చూడడానికి వస్తావా ? అక్కడ ఈర్ష్య వుండదు, ఇసుమంతయినా మోసం వుండదు.... ఈ ఆకాశం క్రింద, తెలివి తక్కువ మనిషి వేసుకున్న ఏ కప్పూలేని యీ నీలి గగనం క్రింద నా నివాసం. హృదయంలో స్పందించేదేదయినా ఆ ఎత్తునుండే రావాలి. అలా రానప్పడు మిగిలేవి గీతలూ, చప్పుళ్ళే ! ఆత్మలేని శరీరం మట్టిముద్దే కదూ." అని ఒక మిత్రుడికి రాసిన ఆ మహా మనిషే యింకొకచోట అంటాడు :

"ఇంతటినీ సృజించిన ఆ మహా కళాకారుడి ఎదుట మన రచనలనగా ఎంత ?"

ఆమెన్ !

---